

# మా నాయిన ట్రిక్కు నేర్వని కత

మా యింటి ముందర యిస్కూటరాగి 'పీపీపీ' మంటా రెండుసార్లు హారను మోగిచ్చిందంటే నల్లెంకారెడ్డి వచ్చినట్టే లెక్క.

నల్లెంకారెడ్డి (నల్ల+వెంకారెడ్డి) ఎప్పుడొచ్చినా యిస్కూటరాపి స్టాండేసి యింట్లోకి రాడు. బయిట్నే హారను కొట్టి పిలస్తాడు మా నాయిన్ని.

'మోటారులో నీళ్లు రావడంలా కరీం భాయ్! రాంతొచ్చి చూడవా? అర్జెంట్' అన్నాడు, హారను శబ్దానికి మా నాయిన బయిటికి రాంగానే.

ఎవురైనా పని చెప్పిన ఎమ్మటన్నే స్క్రూడ్రైవరూ కటింగ్ ప్లేరూ ఎత్తుకొని పరిగెత్తే రకం కాదుగదా మా నాయిన. అందుకని 'ఎందుకనా?' అని అడిగినాడు నిమ్మళంగా.

'అదే తెలియడంలా కరీంభాయ్. సుచ్చేస్తే గిర్రమని సౌండ్ వస్తా వుందిగానీ లోపల మోటారు తిరగతావుందో లేదో అర్దం గావడంలా. ఎమ్మటన్నే వెళ్లి చూడవా. ఒకేళ వైండింగు కాలి పొయ్యుంటే మార్చే పని మొదులుబెట్టేద్దూగాని. ఎంతయితే అంతిచ్చేస్తా' అన్నాడు నల్లెంకారెడ్డి.

మా నాయిన ఒక్క మినిట్టు ఆలోచించి 'అట్టాగేలే. చూస్తా' అన్నాడు.

'పొలుమారకుండా ఎమ్మటన్నే వెళ్లు. ఏ సంగతీ హోలుకాడికొచ్చి చెప్పు. అవతల ఇంటర్‌బెల్లుకి టైమవతా వుంది' అంటా ఇస్కూటర్ స్టార్ట్‌చేసి వెళ్లిపోయినాడు నల్లెంకారెడ్డి.

నల్లెంకారెడ్డి మా నాయినకు చాలా కాలంగా తెలుసు. ఆయనింటి పేరు ఏందోగాని మనిషి నల్లగా వుండేసరికి మాకాయన 'నల్లెంకారెడ్డి' అయినాడు. ఆయన కూడా ఒకప్పుడు బాగా బీదరికం అనుబవించినాడంటగానీ ఎంకటేశ్వరా హోలులో క్యాంటీను లీజుకు తీసుకున్నాక దేవుడి దయవల్ల కలిసొచ్చింది. మా యింటికి దగ్గిరగానే పెద్ద ఇల్లు కట్టినాడు. రొంత ఎనకేసినాడు. ఆ యింటికి మా నాయిన వైరింగు చేసినంత కాలం రోజా మా యింటి ముందర ఇస్కూటరాపతా వుండేవాడు నల్లెంకారెడ్డి.

డబ్బుకు పర్వాలేని నల్లెంకారెడ్డి లాంటి మనిషికాడ వైరింగుపనికి, మోటారు పనికి ఎంతంటే అంత తీసుకోవచ్చుగా మా నాయిన? అట్ట చేయడు. ఎట్ట చేస్తాడో చూడండి.

కాసేపు తాలినాక 'రే... రొంత తోడు రారా' అంటా నా చేతిలో సామాన్ల బుట్ట పెట్టి, నల్లెంకారెడ్డి యింటికి బయల్దేరినాడు మా నాయిన.

బావి గట్టునే బిగించి ఉంది నీళ్ల మోటారు. దాని దగ్గరకెళ్లి, పసిబిడ్డ పొట్టనొక్కి చూసే డాక్టరులాగా కాసేపు అటూ ఇటూ తట్టి, సుచ్చేసినాడు మా నాయిన. 'గుయ్'మంటా సౌండు అదిరిపోయిందిగానీ నీళ్లు రాలా. తేడాగా వున్న ఆ సౌండు వినంగానే ప్రాబ్లమేందో అర్దమైపోయింది మా నాయినకి.

అంతే. రెండే రెండు నిమిషాల్లో మోటార్నిప్పి రెండే రెండు నిమిషాల్లో రిపేరు పని పూర్తి చేసినాడు. మోటారు బిగించి మళ్లీ సుచ్చేయగానే జలజలమంటా నీళ్లొచ్చి తొట్టిలో పడినాయి.

'యింక పా' అన్నాడు మా నాయిన, ఆ నీళ్లలోనే చేతులు కడుక్కుంటా.

నాకు బలే బాదయిపోయింది. నిజ్జానికి ఆ మోటారుని విప్పి, మా అంగడికి తీసకెళ్లి, అంతా బాగానే వున్నా వైండింగు కాలిపోయిందని అబద్దం చెప్పవచ్చు మా నాయిన. వైండింగ్ వైరు కొనాలని చెప్పి ఎగస్ట్రాగా మూడు వందలు అడిగి తీసుకోనుండొచ్చు. కొత్తగా వైండింగు చేసినట్టుగా యాక్షను చేసి మళ్లా అదే మోటారును అట్నే బిగించి యింకో వంద రూపాయలు చార్జీ చేసుండొచ్చు. మామూలోళ్లకి తెలియని పని కదా. ఎట్ల చెప్తే అట్ల విని ఎంత చెప్తే అంత యిస్తారు. నల్లెంకారెడ్డయితే ఎన్ని వందలడిగినా కళ్లు మూసుకొని యిచ్చేస్తాడు.

కానీ మా నాయిన అట్టా చేయకుండా అదే దోవన ఎంకటేశ్వర హోలుకాడికి తీసుకెళ్లాడు నన్ను.

'ఏం కరీం భాయ్? నీళ్లొచ్చినాయా?' అన్నాడు నల్లెంకారెడ్డి, మమ్మల్ని చూస్తానే.

'రాక యాడకి పోతాయా' అన్నాడు మా నాయిన నవ్వతా.

'పోనీలే. బాద తప్పింది. ఎంతిమ్మంటావా?' అన్నాడు క్యాంటీను గల్లా పెట్టెలో నుంచి పదులు, ఇరవైలు తీస్తా.

'ఆ సంబడం పనికి డబ్బులెందుకుగానీ మంచి స్ట్రాంగుగా టీ ఒకటేసి. వీడికి కావాలంటే రెండు పులిబంగరాలు పెట్టీ' అన్నాడు మా నాయిన.

మా నాయినకు టీ. నాకు పులిబంగరాలు. అదీ మా నాయిన సంపాదన.

యిప్పుట్నించే కాదు. ముందు నుంచీ కూడా మా నాయిన వాటమే అంత. చేసిన పనికి ఒక్క నయాపైసా ఎక్కువ తీసుకోడు. ఎక్కువ తీసుకోబల్లేదుగానీ కరెక్టుగా అయినా తీసుకోవాలి కదా. అదీలా.

మా కావలికి చుట్టుపక్కల జలదంకి, సిరిపురం, అల్లూరు, మద్దూరు పాడులాంటి పల్లెటూర్లుండాయి. ఆ వూర్ల రైతులు పొద్దున్నే మా యింటికొచ్చి, టీలు తాగే అలవాటు లాకున్నా మా నాయిన నిద్ర లేచేదాకా సుందరయ్య బొంకుకాడ టీలు తాగతా కూచుంటారు. మా నాయిన లేచినాక దగ్గరుండి పొలాల్లో నీళ్ల మోటార్ల రిపేర్లకి పిలచక పోతారు. పాపం వాళ్లు బలే అమాయకులు గదా. కరెంటు పనిలో ఏమి మోసం చేసినా వాళ్లకు అర్దంకాదు.

అయినాగానీ 'చ! కష్టం చేసుకునే వాళ్ల సొమ్ము మనకు బల్లా' అంటా నయాపైసా ఎక్కువ తీసుకునేవాడు కాదు మా నాయిన. అదట్ట పోనిచ్చి ఒక్కసారి రిపేరు చేసొచ్చినాక మళ్లీ రిపేర్లకని రైతులు వస్తే, మా నాయిన యింటి నుంచి కదలకుండా 'యిదిట్ట చెయ్యి, అదట్ట

చెయ్యి' అని కాయితం మీద బొమ్మ గీసిచ్చి మందల చెప్పి పంపించేవాడు. మా నాయిన చెప్పినట్లు చేయంగానే వాళ్లకు నీళ్లొచ్చేవి. అందుకని రైతులకు మా నాయినంటేనే బలే గురి. సచ్చిగీపెట్టినా యింకో కరెంటు పనోడికాడికి పొయ్యేవాళ్లు కాదు.

యిదంతా చూసి మా అమ్మకు కడుపు కాలిపోతా వుండేది. 'యీ మనిషి యిట్టా తిక్కలుగా వుండబట్టేకదా మనం ఒక్క మిద్దే కట్టగలిగాము. సరిగ్గా సంపాయిచ్చుంటే మూడు మిద్దెలు కట్టుండే వాళ్లం కదా' అనేది.

ఆ మాటకి సిగరెట్టు పొగతో పాటు ముసిముసిగా నవ్వతా ఉండేవాడు మా నాయిన.

కరెంటు పనోళ్లకు యిండ్ల వైరింగులోనే బలే డబ్బులొస్తాయి. వైరింగుకు కావలసిన సామాన్లని కొనిపించేటప్పుడే అవసరానికి మించి ఎక్కువ సామాన్లు కొనిపిస్తారు కొంతమంది కరెంటు పనోళ్లు. వాడేటివి వాడి తక్కినవన్నీ రహస్యంగా అమ్మకనూకేస్తారు. (అంటే నాలుగు వైరు కాయిల్సు కావాల్సివుంటే ఆరు కొనిపిస్తారు మన చేత. వాడేది నాలుగు. అమ్ముకునేవి రెండు). మా నాయిన మాత్రం యింటి ప్లాను చూసి, ఈ యింటికి యిన్ని సామాన్లు అవసరమవతాయి అని లిస్టు చెబితే ఆ లిస్టే ఫైనలు. ఒక్క సామాను ఎక్కువయ్యేది కాదు. ఒక్క సామాను తక్కువయ్యేది కాదు.

మా నాయిన రాసిన లిస్టును చూసి అశోకా ఎలక్ట్రికల్స్ సుబ్రమణ్యం (కరెంటు సామాన్ల అంగడాయన) తల పట్టుకునే వాడు. 'నాలుగు సామాన్లన్నా ఎక్కువ రాయ్ కరీంభాయ్. కమీషనన్నా వస్తది కదా' అనేవాడు. మా నాయిన నవ్వేవాడే కాని రాసేవాడు కాదు.

అట్టాంటిది- మా అన్న చదువు మానేసి మా నాయినకాడ పనిలో చేరినాక ఎవరు చెడగొట్టినారో ఏమోగానీ ఒక రోజు మేము వైరింగు చేస్తా వున్న యింట్లో నుంచి ఒక వైరు కాయిల్ ఎత్తకొచ్చేసినాడు రహస్యంగా.

మా నాయిన గమనించలా. యింటికొచ్చినాక చూసి ఒణికి పోయినాడు. అదే వైరుని విప్పి మా అన్నను తన్నినాడు చూడూ- ఒళ్లు వాతలు తేలిపోయింది.

'నువు యిప్పుడే యిట్టా చేస్తే రేపు నీకు పనెవరు యిస్తర్రా హరాము నా కొడకా. నమ్మకం పోయినాక పనోడు బతికినా ఒకటే సచ్చినా ఒకటేరా' అని, మనిషి ఎర్రంగయిపోయి కళ్లల్లో నీళ్లు తెచ్చేసుకున్నాడు. అంతే. ఆ మాటలు అట్నే కూచుండిపోయినాయి మా అన్న మనసులో. మళ్లీ వాడు ఎక్కడా పూచిక పుల్ల తాకలా.

మా ఇస్కూలు వదిలినాక ఒక్కోరోజెల్లి మా అంగడికాడ కూచునే వాణ్ణి నేను. మా అన్నలాగా పనికి తిరుక్కోకుండా శుద్ధంగా చదువుకుంటా వుండానని బలే మర్యాదగా

చూసేవాళ్లు నన్ను మా అంగడికాడ. ఒక రోజు యిట్నాగే కూచోనుంటే బర్త చనిపోయిన ముసలి శెట్టెమ్మొకామె వచ్చింది మా అంగడి కాడికి. మా అంగట్లోకి అట్టా యిట్టా చూస్తా 'నాయినా! ఒక్కో సీరియల్ సెట్టుకి బాడిగ ఎంత?' అని అడిగింది మా నాయిన్ని.

'రోజుకి రెండు రూపాయలు' అన్నాడు మా నాయిన.

'టేబులైటుకీ'

'నాలుగు'

అప్పుడా శెట్టెమ్మ ఒకటికి నాలుగుసార్లు వేళ్లు మడిచి లెక్కలేసుకొని 'నాయినా! రేపు మా యింట్లో రెండు సీరియల్ సెట్లు, రెండు ట్యూబ్ లైట్లు వెయ్యావా' అనింది.

ఆ లెక్కకి మా నాయిన నవ్వినాడు.

'అబ్బో! పెద్ద డెకరేషనే. ఏంది కతా శెట్టెమ్మా' అన్నాడు వేళాకోళంగా.

'నా కూతురి పెళ్లి నాయిన. తంటాలు పడి ఎట్నో చేస్తా వున్నా. నా కూతురు మనసు కష్టపెట్టుకుంటుందనిగానీ లాకుంటే యీ లైటింగు కూడా చేయించలేను నాయినా' అనిందామె, నిజం చెప్తేస్తా.

మా నాయిన కరిగిపోయినాడు.

'అంగడిలో పడుండే లైట్లు మీ యింటికేస్తే నాకు పోయేదేమీ లేదుగానీ యింకేమీ చెప్పబళ్లేదు పో. ఆరు సీరియల్ సెట్లు, ఆరు టేబులైట్లు వేస్తాను పో' అంటా మాటిచ్చినాడు. అన్నమాట ప్రకారమే పోయి వేసొచ్చినాడు.

యిట్టా చేస్తా వుంటాడు కాబట్టే మా నాయిన కాడ పని నేర్చుకున్న పిలకాయలు ఇస్కూటర్లెక్కి తిరగతా వుంటే, మా నాయిన మాత్రం అట్లాసు సైకిలెక్కి పోతా వుంటాడు పనికి. మద్దూరు పాడుకు కూడా సైకిలు తొక్కుకునే వెళ్లే మా నాయిన బాధను చూసి, మా అమ్మ తాళలాక 'ఎట్నోకట్ట చేసి లూనాయో బూనాయో కొనుక్కోరాదా' అనంటే 'యిప్పుడు అదొక్కటే తక్కువ మనకి' అనేవాడు మా నాయిన.

మా ఊళ్లో రేడియోలు రిపేరు చేసే సీనియర్ సాయిబొకాయన యానాదోళ్లు రిపేరుకి తెచ్చిచ్చే రేడియోల్లో సామాన్లు నూకేసి, యాభై రూపాయల రేడియోని నూటాభై రూపాయలకి అమ్మేసి వేలు సంపాదించేసినాడు తొందరగా. ఆయనకాడికి రేడియోపోతే పర్వేటాస్పత్రికి జబ్బు మనిషి పోయినట్టేనని అందరూ అనుకుంటా వున్నా రిపేర్లకి మాత్రం గిరాకీ తగ్గేదికాదు.

ఆ మనిషి మా నాయిన సంపాదించే తీరు చూసి ఒక రోజు బలే సలహా యిచ్చినాడు.

'కరీం భాయ్! మనం చేసేది ఎలక్ట్రికల్ పని. అసలికి 'ఎలక్ట్రిక్' అనే పేరులోనే 'ట్రిక్కు' ఉండాది. మనం ట్రిక్కు చేసే డబ్బులు సంపాదించాలి. సత్తెకాలానికి పోతే బతకలేము' అన్నాడు.

ఆ మాటలకి నవ్వి యింటికొచ్చి సంగతి చెప్పినాడు మా నాయిన. బాగుపడే సలహానే కదా యీ మనిషి నవ్వతా వున్నాడేంది అనుకున్నాం యింట్లో.

కొన్ని రోజులకి 'ట్రిక్కు'లు చేస్తా డబ్బులు సంపాదించిన సాయిబు చనిపోయినాడు. ఆ వార్త విని 'పోయినాడు దొంగ నా కొడుకు' అనుకున్నారు మా ఊర్లో.

అప్పుడర్థమైంది మాకు మా నాయిన 'ట్రిక్కు' ఎందుకు నేర్వలేదో, మా నాయిన దారినపోతా వుంటే అందరూ మరేదగా 'కరీం భాయ్' అంటా ఎందుకు సలాము చేస్తా వుంటారో.

